# కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం
# స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకం
# 8న విజయవాడలో నిరసన ధర్నా
# కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం రౌండ్‌టేబుల్‌లో వక్తలు
# అన్ని రాజకీయపక్షాలుగా సిఎంను కలవాలని నిర్ణయం

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు రాయితీలిచ్చేదిగానూ సామాన్యులపై భారాలు పెంచేదిగానూ ఉందని, వ్యవసాయం, ఉపాధి హామీ, ఆహారభద్రత, రైతులకు మద్దతు ధర లాంటి వాటికి కేటాయింపులు తగ్గించారని వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వక్తలు పేర్కొన్నారు. దీనికి నిరసనగా 8వ తేదీన విజయవాడలో నిరసన ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర బడ్జెట్ ప్రజలపై భారాలు, రాష్ట్రానికి అన్యాయం అనే అంశంపై శుక్రవారం విజయవాడలోని ఎంబివికెలో సిపిఎం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి పలు రాజకీయపార్టీలకు చెందిన నాయకులతోపాటు, రైతు ప్రతినిధులు, మేధావులు, న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు, వ్యాపార వేత్తలు, రవాణారంగ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, యువజన, విద్యార్థి, మహిళ, కార్మిక రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, అఖిల భారత రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. కేంద్రం వసూలు చేసే మార్కెట్‌సెస్‌లో రాష్ట్రానికి వాటా ఇవ్వాలని కోరారు. ఆదాయపన్నులోనూ పెద్దలకు రాయితీలు కల్పించారని, మేజర్ పోర్టులను ప్రైవేటు వ్యక్తులు చేతుల్లో పెడుతున్నారని తెలిపారు. ఎఫ్‌డిఐలకు 100 శాతం టాక్స్ రాయితీ ఇచ్చిన ఘనత బిజెపి ప్రభుత్వానికి చెందుతుందన్నారు. ప్రజలను మోసం చేసి ఓట్లు రాబట్టుకునే అత్యంత నీచమైన రాజకీయం కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఈ విషయంలో సిఎంతోపాటు, ప్రధానప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన నాయకులు పవన్‌కల్యాణ్‌ను కలవాలని, బడ్జెట్‌పై వారి అభిప్రాయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలపక్షాన నిలుస్తారో, కేంద్రానికి భజన చేస్తారో తేల్చాలని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ బడ్జెట్‌లో రూపాయి కూడా రాష్ట్రానికి రాలేదని తెలిపారు. ఈ విషయంలో వైసిపి, టిడిపి ప్రకటన చేసి ఊరుకున్నాయని, అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తడం లేదని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ప్రశ్నించాల్సింది పోయి ఎవరికివారు మిన్నకుండిపోతున్నారని, ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానిమోడీ ప్రజలవైపు చూడటం లేదని, కేవలం కార్పొరేట్ల సేవలో మునిగిపోయారన్నారు 25 మంది ఎంపిలను ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానన్నారని, ఇప్పుడు 28 మంది ఎంపిలు ఉంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి చేసిన అన్యాయంపై బిజెపి నేతలు నోరెత్తకపోగా రకరకాల వైషమ్యాలు రెచ్చగొట్టి ప్రజల ఆలోచనను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరిగిందని చెబితే కులాలు, మతాలు ఆపాదిస్తున్నారని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నివేదికలోనూ ప్రత్యేక హోదాపై కేంద్రంతో చర్చించుకోవాలని సిఫార్సు చేశారని తెలిపారు. విశాఖ ఉక్కునూ ప్రైవేటీకరించాలని చూస్తున్నాని, అదే జరిగితే మోడీ పతనం ఆంధ్రప్రదేశ్ నుండే మొదలవుతుందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగు ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను చూస్తుంటే దేశాన్ని ముక్కలు చేసి అమ్మేదంలా ఉందని పేర్కొన్నారు. దేశంలో అప్పులు పెరిగినా జాతి సంపద పెరగడం లేదని అన్నారు. ప్రజల నిరసనలకు మతం, కులం రంగు పూసి అణచివేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని తెలిపారు. కార్పొరేట్లతో మాట్లాడేందుకు ముందుకు వస్తున్న మోడీ రైతులతో మాట్లాడేందుకు సిద్ధపడటం లేదని విమర్శించారు. బ్యాంకులను ప్రైవేటీకరించడం వల్ల దేశానికి తీరని అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఎఐకెఎస్(దాసరిభవన్) ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ దేశచరిత్రలో వ్యవసాయ రంగానికి ఏ మాత్రమూ ప్రాధాన్యత ఇవ్వని బడ్జెట్ అన్నారు. కేటాయింపులు కన్నీటి తుడుపుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు మాట్లాడుతూ రవాణా రంగంపై పెనుభారం మోపారని, జరిమానాలు వందల రెట్లు పెంచేశారని తెలిపారు. పెట్రోలు, డీజిల్ తయారీ ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారని, మోటార్ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని వివరించారు. మైక్రో అండ్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ అసోసియేషన్ నాయకులు వినోద్‌బాబు మాట్లాడుతూ జిఎస్‌టి వల్ల పెద్ద ఉత్పత్తిదారులకు లాభం కలుగుతోందని, అమ్మకంలో వారితో పోటీపడలేకపోతున్నామని వివరించారు. ట్రాక్టర్లపైనా జిఎస్‌టి విధించారని పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరాకు వినియోగించే

పైపులు కూడా పక్క రాష్ట్రాల్లో కొనాలని ప్రభుత్వం ఆంక్షలు విధించిందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్నవారు, తెస్తామన్న వారు ఇప్పుడు ప్రత్యేక ద్రోహం చేస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు తెలుగు ప్రజల విజయానికి ప్రతీకని అటువంటి ఉక్కును అమ్మడానికి అంగీకరించేది లేదని తెలిపారు. అధికార వైసిపి, టిడిపి, జనసేన దీనిపై నోరెత్తడం లేదని తెలిపారు. మీడియం అండ్ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ నాయకులు రామచంద్రరరావు మాట్లాడుతూ ఎంఎస్ఎంఇలకు ఈ బడ్జెట్ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దేశ ఎగుమతుల్లో 40 శాతం వీటి నుండే వస్తున్నాయని, 11 కోట్లమందికిపైగా ఉపాధి దొరుకుతోందని, అయినా చిన్నచూపు చూశారని, పెద్ద కంపెనీలకే రాయితీలు ఇచ్చారని తెలిపారు. అమరావతి జెఎసి నాయకులు శివారెడి, బాలకోటయ్య మాట్లాడుతూ నల్లచట్టాలపై ప్రభుత్వానికి పట్టడం లేదని, రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఎపిజెఎఫ్ నాయకులు సిహెచ్.కృష్ణాంజనేయులు మాట్లాడుతూ బడ్జెట్‌పై అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరెత్తకపోవడం అన్యాయమన్నారు. దీనిపై ఉద్యమ కార్యాచరణకు వెళ్లడం ద్వారానే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందన్నారు. దీనిపై సిపిఎం నిర్వహించే అన్ని కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా అధికార, ప్రతిపక్షపార్టీలు నోరెత్తకపోవడం అన్యాయమన్నారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు వేమూరి బాబూరావు మాట్లాడుతూ బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని తలుచుకుంటే కన్నీళ్లు వస్తున్నాయని, అధికార, ప్రతిపక్ష పార్టీల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. న్యూడెమొక్రసీ నాయకులు పొలారి, మోహన్, ఎస్‌యుసిఐ నాయకులు అమర్‌నాథ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం భయం, బెరుకు లేకుండా ఇష్టం వచ్చినట్లు ప్రజావ్యతిరేక విధానాలు చేసుకుపోతోందని తెలిపారు. ఆప్ నాయకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వానికి విలువలేదని బడ్జెట్‌ను చూస్తే అర్ధమవుతుందని తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు మేళం భాగ్యారావు మాట్లాడుతూ మోడీ నేతృత్వంలో దేశంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని పేర్కొన్నారు. అలాగే నాయకులు పోతలు బాలకోటయ్య, మార్టిన్ తదితరులు మాట్లాడారు. తొలుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు వక్తలను వేదిక మీదకు ఆహ్వానించారు. దీనిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, వి.కృష్ణయ్య, ఎం.కృష్ణమూర్తి, ఎం.సీతారాం, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరావు, డి.సుబ్బారావు, డి.రమాదేవి పాల్గొన్నారు.

= = = =